ప్రజాశక్తి

ఆదివారం 25 మే 2025

5

విజయనగరం

పిఎసిఎస్ రుణగ్రహీతలకు నోటీసులు

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రుణం తీసుకున్న వారంతా తమ ముందు హాజరుకావాలని విచారణాధికారి రిజ్వాన్ షరీఫ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ పిఎసిఎస్‌లో ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే విచారణ అధికారిగా సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రిజ్వాన్ షరీఫ్‌ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. విచారణ అధికారి ఇప్పటికే రుణగ్రహీతలందరికీ నోటీసులు ఇచ్చినప్పటికీ, కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. దీంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి బాడంగి పిఎసిఎస్‌లో తాము అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. మిగిలిన రుణగ్రహీతలంతా హాజరై, తాము తీసుకున్న రుణం, జమ, చెల్లింపుల వివరాలను తెలియజేసి, అందుకు గల రశీదులు, ఇతర ఆధారాలను సమర్పించాలని కోరారు.

ఉపాధ్యాయ బదిలీల జాతర

- 3251 మందికి తప్పని స్థానచలనం
- హెచ్ఎంలకు ముగిసిన దరఖాస్తు గడువు
- స్కూల్ అసిస్టెంట్లకు నేటి వరకు...
- 27 వరకు ఎస్‌జిటిలకు అవకాశం

తప్పనిసరి బదిలీ కానున్న ఉపాధ్యాయుల వివరాలు

హెచ్ఎం	26
ఎస్ఎ లెక్కలు	285
ఎస్ఎ పిఎస్	213
ఎస్ఎ బిఎస్	184
ఎస్ఎ సోషల్	150
ఎస్ఎ ఇంగ్లీషు	209
ఎస్ఎ హిందీ	70
ఎస్ఎ తెలుగు	125
పీడీ	60
పిఎస్ హెచ్ఎం	83
ఎస్‌జిటిలు	1797
ఎల్‌పి హిందీ	3
ఎల్ పి తెలుగు	32
పిఇటిలు	11

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోగా బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో దాదాపు 8155 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరిలో 3251 వేల మంది వరకు తప్పనిసరి బదిలీ కానున్నారు. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, ఒక చోట ఎనిమిదేళ్లు పూర్తిచేసిన ఉపాధ్యాయులు బదిలీలకు సాధారణ అర్హులుగా ఉంటారు. వీరితోపాటు ఒకేచోట రెండేళ్లు సర్వీసు చేసిన వారు విజ్ఞప్తి ప్రాతిపదికన బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. బదిలీ దరఖాస్తులకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలన్నీ ఈనెల 31వ తేదీ నాటికి ఉండాలని నిర్ణయించారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధాన ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తుకు గురువారం తుది గడువుకావడంతో ఇప్పటికే వందమంది వరకు దరఖాస్తు చేశారు. స్కూలు అసిస్టెంట్లకు ఆదివారంతో దరఖాస్తుకు గడువు ముగియనుంది. ఎస్‌జిటిలు ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. స్కూలు అసిస్టెంట్‌ల నుంచి హెచ్ఎంగా ప్రమోషన్ పొందే వారికి 30వ తేదీన వెబ్ ఆప్షన్లు ఇచ్చి 31న బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. సీనియార్టీల జాబితాల విడుదలకు కూడా షెడ్యూలు ప్రకటించారు. ఇప్పటికే పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 13,26 కెజిబివి పాఠశాలలను మోడల్ స్కూల్సుగా ఎంపిక చేశారు. ఈ పాఠశాలలో కనీసం నలుగురు ఉపాధ్యాయులకు తగ్గకుండా ఉండేలా చూడాలని నిర్ణయించారు. ఒకటి నుంచి ఐదోతరగతి వరకు బోధన చేయాల్సి ఉంది. ప్రతీ పంచాయతీలో మోడల్ స్కూలు ఏర్పాటుకు 13 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఆదర్శ పాఠశాలలకు ఇప్పటికే ఉపాధ్యాయుల ఎంపిక కూడా జరిగింది. దీంతో ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీల చట్టం వర్తించదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో మొత్తం 2286 పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో పనిచేస్తున్న 8145 మందిలో 8 ఏళ్ళ, ఐదేళ్ల పూర్తి చేసిన వారు 3251 మంది వరకు బదిలీకి సిద్ధంగా ఉన్నారు. విజ్ఞప్తి ప్రాతిపదికన మరో 500 మంది వరకు బదిలీ కావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, తత్సమాన కేడర్ల నుంచి స్కూలు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించేందుకు జాబితాలను రూపొందించారు. వీటిపై అభ్యంతరాలు స్వీకరించారు. హెచ్ఎంల బదిలీ తరువాత స్కూలు అసిస్టెంట్లకు కూడా ప్రధాన ఉపాధ్యాయుల ప్రమోషన్ జాబితాను ఈనెల 27న విడుదల చేసి 29 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఈనెల 31న తుది జాబితాలను ప్రకటిస్తారు. వీరికి ఒకటి రెండు తేదీల్లో వెబ్ఆప్షన్లను ఇచ్చి 4న బదిలీ ఉత్తర్వులిస్తారు. ఎస్ఎల నుంచి సీనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్ పొందే వారికి 5న కౌన్సెలింగ్ నిర్వహించి 6న ఉత్తర్వులు ఇస్తారు. ఎస్జీటీల సీనియారిటీ జాబితాలను ఈనెల 31న విడుదల చేస్తారు. జూన్ 2 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 7తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చి 11వ తేదీన బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రచురణ

పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల యాజమాన్యాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాను https://teacherinfo.apcfss.in వెబ్సైట్లో అందుబాటులో ఉంచారు. సీనియారిటీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలున్నా ఆదివారం సాయంత్రం ఐదు గంటల్లోగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని డిఇఒ మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

చీపురుపల్లిలో దొంగల బీభత్సం

- అడ్డొచ్చిన ఇద్దరు మహిళలపై దాడి.. ఒకరి పరిస్థితి విషమం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

దొంగల దాడిలో గాయపడిన మహిళ

ప్రజాశక్తి- చీపురుపల్లి

పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇంటిలో భారీ చోరీ జరిగింది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు వృద్ధ మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దోపిడీ సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. పట్టణానికి చెందిన వారణాసి సురేష్ ఇంట్లో తమ కుటుంబ సభ్యులైన వారణాసి కస్తూరి, వైశ్యరాజు చిట్టితల్లి నిద్రిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు ఇంటి వెనుక భాగం నుండి లోపలకు చొరబడి దోపిడీకి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆ మహిళలు వారిని అడ్డుకోవడానికి ప్రతిఘటించారు. అయితే మారణ ఆయుధాలతో వచ్చిన దుండగులు వారిపైన విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో మహిళలు అస్వస్థతకు గురి కావడంతో దుండగులు తమ పనిని పూర్తిచేసుకుని వెళ్లిపోయారు. శనివారం తెల్లవారు జామున పాలు పోయడానికి వచ్చిన పాల వ్యాపారి ఇద్దరు ఆ ఇద్దరు మహిళలు గాయపడి ఇంటిలో రక్తపు మడుగులో పడి ఉండటాన్ని చూసి సమీప బంధువులకు సమాచారం అందజేశారు. అనంతరం చీపురుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రత్యేకించి మారణ ఆయుధాలతో దాడి చేయడం వల్ల తలకు బలమైన గాయాలు అయ్యాయని, దీంతో వారు అపస్మారక స్థితిలోకి చేరుకున్నట్లు వివరించారు. డిఎస్‌పి రాఘవులు, సిఐ శంకర్రావు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో పాటు జాగిలాలను కూడా రంగంలోకి దింపి దర్యాప్తును ప్రారంభించారు. దుండగుల ముఠా ఇతర రాష్ట్రాలకు చెందిన వారై ఉంటారని స్థానిక పోలీస్ అధికారులు నిర్ధారించుకొని దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీ జరిగిన ఇంటికి సంబంధించి ఇంటి యజమాని వారణాసి సురేష్ వారం రోజుల కిందట సరస్వతి పుష్కరాల కోసం తీర్థ యాత్రలకు తన భార్యతో కలిసి వెళ్లారు. ఇంటిలో ఇద్దరు వృద్ధ మహిళలతో పాటు సురేష్ కుమారులు ఇద్దరూ ఇంటిలోనే ఉండేవారు. వారు ఈ నెల 23న విశాఖపట్నం వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. దోపిడీలో ఏ మేరకు నష్టం జరిగిందనేది ఇంటి యజమాని సురేష్ ఇంటికి చేరుకుంటే తప్ప ఏమి చెప్పలేమని పోలీసులు వెల్లడించారు.

దోపిడిలో పాల్గొన్నది ఇద్దరే?

దోపిడీ సంఘటన జరిగిన సమయంలో తీవ్రంగా గాయపడిన మహిళల్లో ఒకరు అస్వస్థతకు చేరుకున్నారు. మరో మహిళకు కొద్దిగా మెళకువ ఉండడంతో దోపిడీకి ప్రయత్నం చేసినది ఇద్దరు వ్యక్తులేనని చెబుతోంది. దోపిడీకి పాల్పడిన వ్యక్తులు ఎటువంటి ఆధారాలూ లభించకుండా సంఘటన జరిగిన స్థలంలో రక్తపు మడుగులను సైతం గుర్తించకుండా కారం పొడి చల్లారని పోలీసులు వివరించారు. ఇటీవల కాలంలో చీపురుపల్లిలో తరుచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి రాఘవులు

యోగాపై శిక్షణకు
4,400 మంది ఎంపిక

- 27 నుంచి 31 వరకు గ్రామస్థాయిలో శిక్షణ
- జిల్లా కేంద్రంలో ప్రతిరోజూ శిక్షణ : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

జిల్లాలో నెలరోజుల పాటు నిర్వహించనున్న యోగాంధ్ర -25 కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో యోగాసనాలపై శిక్షణ ఇచ్చేందుకు 4,400 మందిని వెంటనే గుర్తించాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర జిల్లా ప్రత్యేక అధికారి ఎస్.సేతు మాధవన్ ఎంపిడిఒలను ఆదేశించారు. వారందరికీ 27 నుంచి 31వ తేదీ వరకు మాస్టర్ శిక్షకుల ద్వారా ఆయా మండలాల్లో శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ఏడుగురు యోగ శిక్షకులను గుర్తించి వెంటనే వారి పేర్లు ఆన్‌లైన్ లో నమోదు చేయించాలన్నారు. మండలంలో గుర్తించిన యోగ శిక్షకులకు శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో మండలానికి ఇద్దరు మాస్టర్ ట్రెయినర్లను కేటాయిస్తామని, వారి ద్వారా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ శనివారం జిల్లా అధికారులు, ఈ కార్యక్రమ నిర్వాహక కమిటీ సభ్యులు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లతో ఆన్ లైన్ సమావేశంలో సమీక్షించారు. ఐదు రోజుల శిక్షణ పూర్తిచేసుకున్న గ్రామస్థాయి శిక్షకులకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగ ద్వారా సర్టిఫికెట్లు కూడా అందజేస్తామన్నారు. వీరంతా గ్రామస్థాయిలో యోగాపై శిక్షణ ఇవ్వాల్సి వుంటుందన్నారు.

నగరంలోని పౌరులతో సోమవారం నుంచి ప్రతిరోజూ యోగాసనాలు వేయించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద సోమ, మంగళ వారాల్లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రదేశాల్లో ఈనెల 30న యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు నిర్వహించే కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా పర్యాటక అధికారిని జె.సి. ఆదేశించారు. జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున ప్రజానీకం యోగ పోర్టల్ ద్వారా నమోదు చేసుకునేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

కోళ్లఫారాన్ని తొలగించాల్సిందే

ఐదు గ్రామాల బాధితులు ఆందోళన • టెంటు వేసి అక్కడే బైఠాయింపు

ప్రజాశక్తి- మెంటాడ

కోళ్లఫారం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మండలంలోని బిరసాడవలస వద్ద ఆర్అండ్‌బి రోడ్డుకు ఆనుకొని ఉన్న కోళ్లఫారాన్ని అక్కడ్నుంచి తొలగించాలని ఆ గ్రామంతోపాటు సమీప నాలుగు గ్రామాల ప్రజలు ఆ ఫారం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. తొలగించేవరకూ ఇక్కడ్నుంచి కదిలేది లేదని తెగేసిచెప్పారు. సిబ్బందిని, కూలీలను లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అక్కడే టెంట్లు వేసుకుని బైఠాయించారు. ఐదేళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటైన కోళ్లఫారం స్థాయితో పాటు స్థానికులకు కష్టాలు పెరిగాయి. భరించలేని దుర్గంధంతో బిరసాడవలస గిరిజనులు సహజీవనం చేస్తున్నారు. రానురాను దుర్గంధం పెరగడం, యాజమాన్యం పట్టించుకోకపోవడంతో వారంతా శనివారం ఉదయాన్నే అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలిసి ఈ కోళ్లఫారం ప్రత్యక్ష, పరోక్ష బాధిత గ్రామాలైన గదబవలస, చింతలవలస, కైలామ్, అమరాయివలస నుంచి కూడా ప్రజలు అక్కడకు చేరుకున్నారు. కోళ్లఫారం వ్యర్థాలను గుంతలోకి తరలిస్తున్నప్పటికీ దాని ఊట వల్ల పంట దెబ్బతింటోందని వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట దిగుబడిపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భరించలేని దుర్గంధంతో పిల్లలు, పెద్దల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన చెందారు. కోళ్లఫారం ఊట చేరి దగ్గర్లోని అనంత సాగరంలోని చేపలు చనిపోతున్నాయని వాపోయారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

ఎసి కోళ్లఫారం అని, ఎవరికీ ఇబ్బంది ఉండదని అప్పట్లో అమాయక ప్రజలను అప్పటి నేతలు నమ్మించారు. అధికారులు సైతం ముందువెనుకా చూడకుండా ఫైలు కదిపేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు మంజూరు చేశారు. దుర్గంధంపై ఇన్నేళ్లు ఓపిక పట్టిన బాధితులు ఇప్పుడు ఆగ్రహంతో కట్టలు తెంపారు. తమకు ఎదురవుతున్న ఆరోగ్య, ఆర్థిక నష్టాలకు ఏం సమాధానం చెప్తుందని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. యాజమాన్యం స్వచ్ఛందంగా తక్షణమే కోళ్లఫారాన్ని తొలగించకపోతే ఆ పని తాము చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో కోళ్లఫారం యాజమాన్యం పంపిన ప్రతినిధులు.. బాధితులతో చర్చలు జరిపారు. వచ్చే నెల ఐదో తేది వరకు గడువు ఇవ్వాలని, యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో బాధితులు ఆందోళన విరమించారు.

27న క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్

విజయనగరంకోట : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 27న ఉదయం 9గంటల నుంచి క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 9 కంపెనీలు పాల్గొనే ఈ డ్రైవ్‌కు ఐటిఐ పాసైన వారు, ఆగస్టు 2025 పరీక్షలకు హాజరు కాబోయే చివరి సంవత్సరం అభ్యర్థులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డ్, 2 ఫొటోలతో పాటు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9849118075, 9849944654 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇరిగేషన్ కార్యాలయం
అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

రికార్డు రూములో మద్యం తాగుతున్న సూపరింటెండెంట్

ప్రజాశక్తి-బొబ్బిలి

రికార్డు రూములో మద్యం తాగుతున్న సూపరింటెండెంట్

బొబ్బిలి ఇరిగేషన్ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ఇరిగేషన్ రికార్డులను భద్రపరిచే గది కార్యాలయ మేడపై ఉంది. ఈగదిలో ఇరిగేషన్ సూపరింటెండెంట్ సురేష్ నిత్యం మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డ్యూటీ సమయంలో రికార్డు రూములో మద్యం సేవించడంతో తోటి ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సూపరింటెండెంట్ తప్పులను ప్రశ్నిస్తే భయపెడుతున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులే సర్వర్లు

సూపరింటెండెంట్ సురేష్ మద్యం తాగాలనుకుంటే, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులే అన్ని ఏర్పాట్లూ చేయాలి. మద్యం తాగేందుకు ఏర్పాట్లు చేయకపోతే వేధిస్తున్నారని కొంతమంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డు రూమును బార్ షాపుగా మార్చివేసి గ్లాసులు, వాటర్ బాటిళ్ళు, మద్యం అక్కడ పని చేస్తున్న ఉద్యోగులే సరఫరా చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రాత్రివేళ వ్యభిచారం?

ఇరిగేషన్ కార్యాలయం మేడపై రాత్రి సమయాలలో వ్యభిచారం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మద్యం తాగి వ్యభిచారం చేస్తున్నట్లు చుట్టుపక్కల ఉన్న వారంతా చెబుతున్నారు. మద్యం సేవించిన సీసాలు, గ్లాసులు, వ్యభిచారం కోసం తెచ్చుకున్న తలగడలు, నిరోధులను ఇళ్లలో పడేస్తున్నారు. దీంతో ఆయా ఇళ్లలో ఉన్నవారు ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెపుతున్నారు. ఇరిగేషన్ కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తోటి ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటాం

ఇరిగేషన్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్ మద్యం తాగినట్లు తన దృష్టికి రాలేదని ఇరిగేషన్ ఎస్ఇ అప్పారావు చెప్పారు. కార్యాలయంలో మద్యం తాగడం నేరమన్నారు. మద్యం తాగినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విఎంఆర్‌డిఎ ప్రణాళికపై అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ గతంలో రూపొందించిన బృహత్తర ప్రణాళికపై ప్రజల నుంచి అభ్యంతరాలను, సూచనలను కోరుతూ సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 136 ఎంఎ యుడి 8.11.2021న విడుదల చేసిన బృహత్తర ప్రణాళికను ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుతం వి ఎం ఆర్ డి ఎ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలకు ఒక బృహత్తర ప్రణాళిక 2041 ఆమోదించే నిమిత్తం ప్రజాభిప్రాయాన్ని కోరుతున్నట్లు కమిషనర్ తెలిపారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాధన్ అందించిన వివరాల ప్రకారం ఈ ప్రణాళిక పై పునః పరిశీలన చేసేందుకు ప్రతిపాదించినందున సదరు ప్లాన్ పై అభ్యంతరాలు, సలహాలను ప్రజల నుంచి కోరుతున్నట్లు తెలిపారు.

మే 22 నుండి జూన్ 21 వరకు ప్రజలు తమ అభిప్రాయాలను సూచనలను రాతపూర్వకంగా స్వయంగా గాని పోస్టు ద్వారా గాని విఎంఆర్‌డిఎ విశాఖపట్నం కార్యాలయానికి తెలియజేయాలని తెలిపారు. లేదా వెబ్సైట్ vmrda.gov.in/objections ద్వారా గాని పంపాలని తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ జీవనరాణి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

లింగనిర్ధారణ చేస్తే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి హెచ్చరించారు. గర్భధారణ పూర్వ , గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం శనివారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జీవనరాణి మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు స్కానింగ్ సెంటర్ లను విధిగా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు డిఎంహెచఒ డాక్టర్ కె.రాణి, పిసిపిఎన్‌డిటి నోడల్ అడికారి అచ్చుత కుమారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎన్. సూర్యనారాయణ, స్త్రీ వైద్య నిపుణులు జె.సుధ, చిన్నపిల్లల వైద్యులు కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

సాలూరులో విద్యుత్తు కోత ఖరీదు రూ.1.24 కోట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / సాలూరు

బొంకరా మల్లన్న అంటే 'మా ఊరి మిరియాలు తాటికాయంత' అన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. అచ్చంగా అలాగే ఉంది సాలూరు శ్యామలాంబ పండగలో విద్యుత్ అంతరాయానికి విద్యుత్ శాఖ (ఎపి ట్రాన్స్‌కో అధికారులు) చెబుతున్న జవాబు. ఈనెల 18 నుంచి 22 వరకు నాలుగు రోజులపాటు ఈ ప్రాంతవాసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సాలూరు శ్యామాలంబం పండగ జరిగిన సంగతి తెలిసిందే. రెండు రోజులపాటు విద్యుత్ కోతతో సాలూరు పట్టణవాసులతో పాటు చుట్టాలు, బంధువులు, స్నేహితులు ఉక్కిరి బిక్కిరి అయిపోయిన సంగతి తెలిసిందే. చాలా ఇళ్లల్లో వంటకు, ఇంకొన్ని ఇళ్లల్లో స్నానాలకు నీళ్లు లేక చుట్టాల వద్ద అభాసుపాలయ్యారు. ఇదే అదునుగా చుట్టరికానికి వచ్చినవారు చిందులు వేయడంతో పండగంటి పూట కూడా నిర్వాహకులు చెవులు మూసుకోవాల్సి వచ్చింది. తీరా ఇందుకు కారణమైన విద్యుత్ శాఖ అధికారుల వివరణ చూస్తే 'కరెంటూ లేదు... రూ.కోట్లు డబ్బులేదు' అన్న విషయం బోధపడుతోంది. పండగలో అత్యంత కీలకమైన మంగళ, బుధవారాల్లో దాదాపు 80శాతం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఖర్చు మాత్రం విద్యుత్ శాఖ అధికారులు సగటు మనిషికి దిమ్మదిరిగే విధంగా రూ.1.24కోట్లు చూపిస్తున్నారు.

పండగ నిర్వహణకు ప్రభుత్వం తరపున మౌలిక సదుపాయాల కల్పన పేరిట రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఇది చాలదన్నట్టుగా ఉద్యోగులు, వ్యాపారులు, చిన్నచిత రాజకీయ నాయకుల నుంచి రూ.కోట్ల రూపాయలు వసూలు కూడా చేశారట. పండగ నిర్వహణ కోసం అధికారిక సమావేశాలు, సమీక్షలు అన్నీ ఇన్నీ కావు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, ముఖ్యంగా మునుపటి మాదిరిగా విద్యుత్ అంతరాయం లేకుండా రథం తిరిగినచోట పొడుగాటి స్తంభాలు పాతేస్తామని, పండక్కి లక్షలాదిగా వచ్చే జనం అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ఓవర్ లోడ్‌కు తగ్గట్టు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ఏర్పాటు చేస్తామని ఇటు విద్యుత్ శాఖ అధికారులు, అటు స్థానిక ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెగేసి చెప్పారు. దీంతో, ఈసారైన బంధు, మిత్రులతో పండగ సరదాగా సందడిగా చేసుకోవచ్చని భావించిన సాలూరు వాసులు తీవ్ర, కష్టనష్టాలు, అవమానాలు చవిచూశారు. అందుకు తగ్గట్టే జనం వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు చాలా ప్రాంతాలకు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో కారుచీకట్లోనే గడపాల్సివచ్చింది. చీకటి మాట అటుంచితే విద్యుత్ అంతరాయం వల్ల నీటి బోర్లు వేయడం సాధ్యం కాలేదు. దీంతో, మంగళవారం సాయంత్రం నుంచే నీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలో అసలే ఇరుకు సందులు ఎక్కువ. చిన్నపిల్లలు, ముసలి ముడగలకు సైతం నిద్రలేదు. పోనీ, కల్చరల్ ప్రోగ్రామ్స్ చూసి కాలక్షేపం చేద్దామనుకుంటే వర్షం అంతరాయం కలిగించింది. బుధవారం నీరులేక వంటకాలకు చాలా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. గారి, బూరి, స్వీట్లు వంటివి పెట్టి ఆప్యాయత ప్రదర్శిద్దామనుకున్నవారు ఒకింత దుఖః దిగమింగారు. చివరికి కాల కృత్యాలు తీర్చుకోవడానికి కూడా వీలుకాని పరిస్థితి ఎదురైంది. ఇదే విషయాలు కమిషనర్ వద్ద ఒకరిద్దరు ప్రస్తావించినా కరెంటు కోతతో తనకేమి సంబంధం అంటూ ఒకింత బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడం పట్ల చాలా మంది అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్, తాగునీటి సమస్యను మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది తమను గెంటేశారంటూ సాక్షాత్తు ఆమె నివాసం ఉంటున్న రామాకాలనీవాసులే ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పట్టణంలోని అనేక చోట్ల విద్యుత్ అంతరాయాన్ని నిరసిస్తూ ప్రజలు నిరసనలు తెలిపినా మంత్రి నుంచి సమాధానం కూడా రాలేదు. ఇంత వైఫల్యంగా జరిగినందుకు సిగ్గుతో తలదించుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు అధిక లోడ్ నివారణకు, అవసరానికి తగ్గట్టు ముందస్తు ఏర్పాటు చేశామని, ఎంతో మంది అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించామంటూ ఏకంగా ప్రకటన జారీచేయడం పట్ల జనం విస్తుపోతున్నారు. చివరకు మంగళవారం రాత్రి నాటి గాలి వర్షానికి చిన్నపాటి ఇబ్బంది కలిగినట్టు బుకాయిస్తున్నారు. వాస్తవానికి గాలి, వానకు ముందు నుంచే అనేక ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేశారు. దీన్నిబట్టి విద్యుత్ సరఫరా పేరిట కేటాయించిన నిధులు పక్కదారి పట్టినట్టు అర్థమౌతోందని పబ్లిక్ టాక్.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సొంత నిధులతో సిహెచ్‌సి అభివృద్ధి

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

సొంత నిధులతో సిహెచ్‌సిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని శనివారం సందర్శించి, వైద్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి ఆర్.వి.జి.కె రంగారావు శత జయంతి సందర్భంగా ఆస్పత్రిని సొంత నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆస్పత్రి అవసరాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్ శశిభూషణరావును కోరారు. ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు.

ఎజిపిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-బొబ్బిలి

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది చెల్లారపు సత్యనారాయణ నియమితులయ్యారు. ఎజిపి నియామక పత్రాన్ని న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి గొట్టాపు ప్రతిమాదేవి అందించారు. ఎజిపిగా నియమించేందుకు సహకరించిన మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయనను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ కేసులను వాదించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తానని ఎజిపి సత్యనారాయణ అన్నారు.

మురళీనాయక్ త్యాగధనుడు

ప్రజాశకి-విజయనగరం టౌన్

దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ గొప్ప త్యాగధనుడని ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జామి అప్పలసూరి అన్నారు. పెహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ తో జరిగిన పోరులో ప్రాణాలను అర్పించిన మురళి నాయక్ ను స్మరించుకుంటూ శనివారం ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కొత్తలి ఎర్నాయుడు, గౌరవ అధ్యక్షులు గౌరీ ప్రసాద్, చిరంజీవిరావు, దినారాయణ,అప్పలనాయుడు, మోహన్ దత్త, తోప్పివాల క్లబ్ అధ్యక్షులు వెత్స సత్యనారాయణ, ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పప్పు విశ్వనాథం, న్యాయవాది నాలుగుస్సెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిటిఇఎల్ పరీక్షలో త్రివేణి టాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ (సిఎస్ఇ) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం. త్రివేణి ఐఐటి ఖరగ్‌పూర్ నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌పిటిఇఎల్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ పరీక్షలో టాప్ 1లో నిలిచినందుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. త్రివేణి మానవ వనరుల అభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న ఎన్‌పిటిఇఎల్ స్వయం ద్వారా అందించిన 'ప్రోగ్రామింగ్ ఇన్ జావా' కోర్సును 92శాతం సమగ్ర స్కోర్ తో విజయవంతంగా పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా 16040 మంది పరీక్షలలో ఉత్తీర్ణత పొందినవారిలో ఆమె టాప్ 1 స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

సర్పంచ్‌కు పరామర్శ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొత్తపేట సర్పంచ్‌కి, జనసేన కార్యకర్తలకు మధ్య జరిగిన ఘర్షణలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ శ్రీనుని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు తదితరులు శనివారం పరామర్శించారు. గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

సచివాలయాన్ని సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 2 వ నెంబర్ సచివాలయాన్ని శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విజిట్ బుక్‌లను గమనించారు. సచివాలయ పరిసర ప్రాంతాలను కలియ తిరిగి పారిశుధ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయానికి సచివాలయ కార్యదర్శులు అందరూ విధులకు హాజరై ప్రజలకు మంచి సేవలు అందించాలని అన్నారు. ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ముందు జాగ్రత్తలతో రక్తనాళాల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ముందస్తు జాగ్రత్తలు, పరీక్షలు నిర్వహించడం వల్ల రక్తనాళాల సమస్యకు పరిష్కారం పొందవచ్చని విశాఖపట్నం అపోలో హాస్పిటల్ రక్తనాళాల వ్యాధి నిపుణులు డాక్టర్ గణేష్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తనాళాలు, రక్తహీనత వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ లక్ష్మి మిథేలి ప్రారంభించారు. ఈ సందర్భంగా 94 మందికి వాస్క్యులర్ డోప్లర్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జెసి రాజు, రోటరీ అధ్యక్షులు ఎలెక్ట్ శ్రీహరి, ఉపాధ్యక్షులు నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

ప్రజాశక్తి- రాజాం

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండియు విధానాన్ని రద్దుచేసి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడంపై మండలంలో రేషన్ డీలర్లు ఆనందం వ్యక్తం చేశారు. రాజాం సివిల్ సప్లయ్ గోదాం వద్ద శనివారం డీలర్లంతా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం రేషన్ డీలర్లు పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు. ఈ మేరకు నాటి వైసిపి ప్రభుత్వం డీలర్ల పొట్ట కొడితే కూటమి ప్రభుత్వం ఆదుకుందని హర్షం వ్యక్తం చేశారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం రేషన్ సరుకులను పక్కాగా పంపిణీ చేస్తామని అన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై అవగాహన

ప్రజాశక్తి-రామభద్రపురం

వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ సత్యవాణి విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రపై శనివారం అవగాహన కల్పించారు. గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి నాయకుల కథల పుస్తకాలను ఇచ్చి చదివించారు. అనంతరం మెదడుకు పదును పెట్టే కారమ్స్, లూడో, వైకుంఠ పాళీ వంటి ఆటలతోపాటు వాలీబాల్ ఆడించారు.

సంతకవిటిలో అన్నదానం

ప్రజాశక్తి - సంతకవిటి

మండల కేంద్రంలో హరే రామ హరే కృష్ణ సప్తహ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం అభయాంజనేయ స్వామి 29వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు జడా నేతాజీ పాల్గొన్నారు.

అరకొర సభ్యులతోనే..

గైర్హాజరైన సభ్యులపై ఎంపిపి అసహనం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

లక్కవరపుకోట మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని అరకొర సభ్యులతోనే నిర్వహించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండలంలో 15 మంది ఎంపిటిసి సభ్యులు ఉండగా, ఎంపిపి, వైస్ ఎంపిపి ముదునూరు శ్రీనివాసరాజుతో సహా ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో గత ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులకు నాణ్యతలేని వరి విత్తనాలు సరఫరా చేయడంతో పంట దిగుబడి లేక రైతులు నష్టపోయారని సభ్యులు మండల వ్యవసాయ అధికారి స్వాతికుమారిని ప్రశ్నించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో అటువంటి సమస్య రాకుండా చర్యలు చేపడతామని ఎఒ తెలిపారు. విద్యుత్తు సమస్యలపై ఆ శాఖ జెఇ రామసత్యాన్ని సభ్యులు నిలదీశారు. భవిష్యత్తులో వాటిని పరిష్కరిస్తామని జెఇ సమాధానమిచ్చారు.

చందులూరు గ్రామ ప్రవేశంలో తారురోడ్డుకు ఆనుకొని సిసి రోడ్డు నిర్మించారని, వీటి అనుమతులు ఎవరిచ్చారని ఎంపిటిసి సభ్యులు ఎడ్ల కిశోర్ ప్రశ్నించారు. తీర్మానం లేకుండా మండలంలో అనేక చోట్ల రోడ్లు నిర్మిస్తున్నారని ప్రస్తావించారు. సిసి రోడ్ల నిర్మాణాల్లో అవకతవకలు ఉన్నాయని ఆయన తెలిపారు. పిఆర్ జెఇ వీరలక్ష్మిని ఎంపిపి వివరణ అడగ్గా, రెండు రోజుల్లో నివేదిక అందిస్తానని తెలిపారు.

గత ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వంలో

సమావేశానికి అరకొరగా హాజరైన సభ్యులు

అభివృద్ధి పరుగులు పెడుతుంటే కొంతమంది సభ్యులు విమర్శిస్తున్నారని తలారి సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ వ్యాఖ్యానించారు. దీంతో గుమ్మడి ప్రసాద్, జమ్మాదేవిపేట సర్పంచ్ కిరణ్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. జమ్మాదేవిపేట ఎంపిటిసి ప్రతినిధి ఆవాల సత్యనారాయణ కలుగజేసుకోవడంతో ఈ వివాదం మరింత తీవ్రమైంది. ఎంపిపి జోక్యం చేసుకుని, వారిని శాంతింపజేశారు. సమావేశానికి పూర్తిస్థాయిలో ఎంపిటిసిలు హాజరుకాకపోవడంతో ఎంపిపి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- ట్రాక్టర్ ఢీ కొనడంతో విరిగి పడిన విదుత్తు స్తంభాలు
- భయాందోళనలో గ్రామస్తులు
- మండలంలో కానరాని నూతన స్తంభాల జాడ

ప్రజాశక్తి-సంతకవిటి

ఒక విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీ కొనడంతో మూడు స్తంభాలు నేలకొరిగాయి. ఈ సమయంలో దగ్గరిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని కృష్ణంవలస గ్రామంలో శనివారం విద్యుత్ స్తంభాన్ని టాక్టర్ ఢీ కొనడంతో చిన్నవీధికి చెందిన మూడు విద్యుత్ స్తంభాలు నేలపై విరిగిపడ్డాయి. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వీధిలో నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. 30ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ఒకసారి ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇంటిని ఆనుకుని పడిపోవడంతో ప్రజలు భయాందోళన చెందారు. కొంతమంది యువకులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ఎటువంటి ప్రాణ నష్టమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే ఢీ కొన్ని ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పనులు ప్రారంభించారు. అయితే మండలంలో అసలు నూతన విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో ఏమి చేయాలో తెలియని స్థితిలో విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

మండలంలోని 34 పంచాయతీల్లో విద్యుత్ స్తంభాలన్నీ మూలకు చేరాయి. గతంలో పలుమార్లు విద్యుత్ స్తంభాలపై రైతులు, ప్రజలు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇటువంటి సంఘటనలు, వర్షాలు కురిసినపుడు చిన్న పాటి గాలికే విద్యుత్తు స్తంభాలు నేలకొరిగిపోతున్నాయి. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పెను ప్రమాదం తప్పింది

మా ఇంటి పైన విద్యుత్ స్తంభం పడి ఉంటే చనిపోయే వాళ్ళం. నా భర్త

ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్తు స్తంభాలు

వికలాంగుడు, అనారోగ్య కారణంగా, వేసవి ఎండ తీవ్రతకు బయటికి రాకుండా ఇంటిలోనే ఉన్నాం. ఒక్కసారిగా శబ్దం రావడంతో బయటకు వచ్చాను. అప్పటికే విద్యుత్ స్తంభం ఇరిగిపడింది. భయాందోళనకు గురయ్యాను. వెంటనే నా భర్తను బయటకు ఎత్తుకుని తీసుకువచ్చాను.

అలచాన అప్పలనరసమ్మ, బాధితురాలు.

బతికి బయట పడ్డాం

మా కుటుంబ సభ్యులు అందరం ఈ నెల 27 జరగనున్న ఆంజనేయ స్వామి మాలధారణకు సంబంధించి ఇంటిని నీటితో శుభ్రం చేసుకుంటున్నాం. స్తంభం పడడంతో ఇళ్లంతా నీటితో ఉండటంతో ఒక్కసారిగా మా ఊపిరి ఆగినంత పనైంది. యువకులు వెంటనే స్పందించి కరెంటును నిలుపుదల చేశారు. లేకపోతే చాలా పెద్ద ప్రమాదం జరిగేది. నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి.

మట్ట రాజు, గ్రామస్తుడు

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని గర్భాం సచివాలయంలో శనివారం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుతం మహిళలకు అధిక ప్రాధాన్యతిస్తుందన్నారు. వారికి స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. మహిళలందరూ దీనిని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులు పిన్నింటి సన్యాసినాయుడు, సీనియర్ నాయకులు కోట్ల మోతిలాల్ నాయుడు, తాడ్డి చంద్ర శేఖర్, తాడ్డి శ్రీధర్, మండల రమణ మోహనరావు, చంద్రశేఖర్ రాజు, పెరిచర్ల భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా బిజిలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆంధ్రా యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాలలో శ్రీషిరిడి సాయి డిగ్రీ కళాశాల విద్యార్థి యడ్ల బిజిలి 9.04 జిపిఎ పాయింట్లతో జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా బిజిలిని కళాశాల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, అధ్యాపక సిబ్బంది అభినందించారు. నాణ్యమైన విద్యను అందించడంతో తమ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు.

2 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-వేపాడ

కారులో తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరకు-విశాఖపట్నం రహదారిలో పాటూరు గ్రామం వద్ద వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. అందులో భాగంగా తెలంగాణకు చెందిన కారును తనిఖీ చేస్తుండగా, కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వల్లంపూడి ఎస్ఐ సుదర్శనరావు తెలిపారు. తహశీల్దార్ రాములమ్మ సమక్షంలో గంజాయిని తూనిక వేశారు.

కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలి

డ్వామా కోర్స్ డైరెక్టర్ చిన్నం నాయుడు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో వేతన దారులకు కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని డ్వామా కోర్స్ డైరెక్టర్ కె.చిన్నంనాయుడు సూచించారు. ఈ మేరకు శనివారం రేగిడి ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతి సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు తప్పనిసరిగా కల్పించాలన్నారు. జాబు కార్డులు ప్రాప్తికి అందరికీ కూలి గిట్టిబాటు అయ్యేలా చూడాలన్నారు. కొలతల ప్రకారం పనులు కల్పిస్తే కూలి గిట్టుబాటు ఉంటుందన్నారు. మెట్టు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు పారంపాండ్సు వేసేలా చూడాలన్నారు. తృతీయ పండ్ల తోటలు వేసుకోవడానికి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారంపాండ్స్ మంజూరులో ఉంటే తక్షణమే పనులు చేపట్టాలన్నారు. రైతులు కంపోస్టు పిట్స్ లబ్దిదారుల గుర్తించి వారికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఎపిఒ 2 ఎం.శ్రీనివాస్ రావు, జెఇ మురళి తదితరులు పాల్గొన్నారు.

సారాతో పట్టుబడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామాల్లో కల్లుగీత కార్మికుల నాటు సారాతో పట్టుబడితే గీత కార్మికుల కార్డు రద్దు చేయడంతో పాటు సంఘం నుండి తొలగించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎఎస్ దొర అన్నారు. శనివారం రామలింగపురం, ముసిరాం గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం -0.2 కార్యక్రమం ఆవశ్యకతను, నాటు సారా వల్ల కలిగే అనరాలను వివరించారు. వాటిపై తీసుకునే చర్యలు, శిక్షలు,చట్టాలపై, అవగాహన కల్పించారు. సంఘాల్లో ఉన్న కల్లుగీత కార్మికులు నాటు సారాయి తయారు చేసినా, అమ్మినా వారిని సంఘం నుండి తొలగించడంతోపాటు గీత కార్మికుల కార్డులను రద్దు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా తయారీకి అవసరమైన బెల్లం సరఫరా చేసే వర్తకులపై కేసుల నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కొత్తవలస సిఐ రాజశేఖర్ నాయుడు, ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్

బేసిక్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి- రాజాం

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనాలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు శనివారం నిరసన తెలిపారు. వీరికి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) సంపూర్ణ మద్దతు పలికింది. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు, విద్యుత్తుతో పాటు ఇతర అత్యవసర పౌరసేవలు అందిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు చర్చల పేరుతో కాలయాపన చేయకుండా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని, 10, 11 పిఆర్‌సిల్లో ఇంజనీరింగ్ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని 12వ పిఆర్‌సిలో సరి చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు అమల్లో ఉన్న జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలని, 62 ఏళ్ల వరకు కొనసాగింపు, పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, 10 లక్షల ఎక్స్ గ్రేషియో, మట్టి ఖర్చులు పెంపు జీవో, తదితర డిమాండ్ల పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని లేదంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మరడాన త్రినాధ్, మున్సిపల్ యూనియన్ నాయకులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

యోగాంధ్ర సాధన లక్ష్యంగా ప్రారంభించిన యోగా మంత్‌లో భాగంగా 100 మంది టిఒటిల, మాస్టర్ ట్రైనీలకు యోగా శిక్షణా కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమయ్యింది. స్థానిక ఇండోర్ స్టేడియంలో 30 మందికి శిక్షణ ఇవ్వగా, మిగిలిన 70 మందికి ఆన్‌లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు పర్యవేక్షించారు. గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఒక్కో సచివాలయం పరిధిలో 7గురిని ఎంపిక చేసి, వీరికి ఆదివారం శిక్షణ నిర్వహిస్తారు. వీరి ద్వారా బ్యాచ్‌కు 50 మంది చొప్పున గ్రామాల్లో విడతల వారీగా యోగా శిక్షణ ఇవ్వనున్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్లేందుకు ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేయనున్నారు. దీనిలో భాగంగా ఈనెల 26 నుంచి మండలాలు, మున్సిపాల్టీల్లో భారీఎత్తున ర్యాలీలు జరగనున్నాయి.

యోగేంద్ర కార్యక్రమాలను విజయవంతం చేయండి

యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. జూన్ 21న విశాఖపట్నంలో భారీ స్థాయిలో జరగనున్న యోగాడేలో పాల్గొనాలని కోరారు.కాన్ఫరెన్స్ లో సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పాల్గొన్నారు.

యోగా శిక్షణ పొందుతున్న మాస్టర్ ట్రైనీలు

ఉపాధి కల్పించాలని కోరుతున్న సింగరాయి దళితులు

'ఉపాధి' కల్పించరూ..

సింగరాయి దళితుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-వేపాడ

ఉపాధి పనులు కల్పించాలని మండలంలోని సింగరాయి దళితులు అధికారులను కోరుతున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ ఎన్.అప్పలనాయుడు తప్పుడు మస్తర్లు వేసి వేతనదారులను మోసం చేస్తున్నాడని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న అధికారులు దర్యాప్తు చేశారు. దర్యాప్తులో ఫీల్డ్ అసిస్టెంట్ తప్పు చేసినట్లు అంగీకరించగా, నివేదికను జిల్లా కలెక్టర్‌కి పంపించారు. అప్పటి నుండి ఫీల్డ్‌అసిస్టెంట్ విధులు నిర్వహించకుండా, రికార్డులు పట్టుకొని కార్యాలయానికి రావాలని పిలిచినా రాకుండా, వేతనదారులకు పని కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఎస్‌సి కాలనీవాసులు ఉపాధి పనులకు దూరమయ్యారు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎపిఒ ఆదిలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా, టిసిఎన్ఎం ఆధ్వర్యాన పని కల్పిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే స్పందించారు..

అపారిశుధ్యం తొలగించారు..

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని రఘుమండలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని ఎమ్మెల్యే నాగమాధవికి గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించిన ఆమె తక్షణమే పంచాయతీ సెక్రటరీతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో శనివారం గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. చెత్త తొలగింపు, రోడ్ల పరిశుభ్రత, కాలువల శుభ్రతపై దృష్టి పెట్టారు. తమ సమస్యను విన్న వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం తమకు ఎంతో ఆనందాన్నిచ్చిందని పలువరు ఎమ్మెల్యేను కొనియాడారు.

ఇంటి పన్నుకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సొంతిల్లు కలిగిన ఇంటి యజమానులు ఇంటి పన్నుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి కోరారు. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయం, పట్టణంలోని ఐదు సచివాలయాలలో ఇంటి పన్నుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ చురుగ్గా సాగుతుందని తెలిపారు. ఇంటి యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సహకరించాలని కోరారు.

నవధాన్యాలతో నేల సారవంతం

ప్రజాశక్తి-వేపాడ

నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందని మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తెలిపారు. నవధాన్యాలు సాగు చేయడానికి అవసరమైన కిట్లను రైతు సేవా కేంద్రంలో సిద్ధం చేశారు. శుక్రవారం బొద్దాం గ్రామంలో యూనిట్ ఇన్‌ఛార్జి రామలక్ష్మి పొలంలో వాటిని చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి గుల్లబారి, పోషకాలు పెరిగి పంటకు అవసరమైన తేమను అందిస్తాయని తెలిపారు. ఎకరాకు 12 కిలోల నవధాన్యాలను చల్లి, వరినాట్లు వేసే ముందు కలియదున్నితే, రైతులు రూ.3 వేల వరకు ఆదా చేసుకోవచ్చని చెప్పారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వేయకున్నా పంట పండించవచ్చని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- డెంకాడ

మండల పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు అధికారుల సహాయంతో రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే 26వ జాతీయ రహదారి పై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారి అయినాడ జనక్షన్ నుంచి రాజాపులోవ వరకు తరచూ ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించామని వాటికి బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అక్కడ 12 పెద్ద సైజు ట్రైర్లను ఏర్పాటు చేసి వాటికి రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ రహదారి మోదవలస వద్ద రెండు బ్లాక్ స్పాట్ ప్రదేశాల్లో ఈ ట్రైర్లను ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లను వాటికి పెట్టామని తెలిపారు. వాహనదారులు ఓవర్ స్పీడ్‌లో వాహనాలను నడపకుండా జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు.

కల్వర్టు వద్ద స్టాప్ బోర్డులు ఏర్పాటు

విజయనగరం కుమిలి రహదారిపై ఆర్ ముంగనాపల్లి సమీపంలో కుంగిపోతున్న కల్వర్టు వద్ద పోలీసులు స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టు కుంగిపోతుండటంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాశక్తిలో ఇటీవల కథనం వెలువడింది. దీనికి స్పందించిన స్థానిక ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు స్టాప్ బోర్డలను ఏర్పాటు చేసి రోడ్డుకు అడ్డంగా మట్టి దిమ్మలను వేశారు. ఆర్అండ్‌బి అధికారులు చేయవలసిన పనిని ఎస్ఐ ముందుకొచ్చి చేయడంతో ఆయనను పలువురు అభినందిస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి కల్వర్టు బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్‌కుమార్

మహానాడును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడిపి శ్రేణులు కడపలో నిర్వహించనున్న మహానాడును జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశేఖర్, ఆనంద్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29 వరకు జరిగే మహానాడుకు నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు అవనాపు సత్యనారాయణ, బైరెడ్డి నాగేశ్వరరావు, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.